క్లుప్తంగా

22న మణికొండలో ఉచిత వైద్య శిబిరం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వీఆర్‌ఫోర్‌యూ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. యశోదా ఆస్పత్రికి చెందిన కార్డియాలజీ, న్యూరోలజీ, ఆర్థోపెడిక్, పల్మానాలజీ, జనరల్ మెడిసిన్, గైనకాలజీ, డెంటల్, ఆప్థమాలజీ డాక్టర్‌లు ఇందులో పాల్గొంటారని, అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

12 మందికి జైలు శిక్ష

శంషాబాద్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 37 మందిని గురువారం రాజేంద్రనగర్ మెట్రోపాలిటన్ కోర్టులో ఆర్‌జీఐఏ ట్రాఫిక్ పోలీసులు హాజరుపర్చారు. ఇందులో 12 మందికి జరిమానాతో పాటు గరిష్టంగా ఐదు రోజుల జైలు శిక్షను న్యాయమూర్తి విధించినట్లు ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. మిగతా ప్రతివాదులకు కూడా జరిమానా విధించినట్లు తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం


అదుపు తప్పి పొదల్లోకి దూసుకెళ్లిన కారు

మణికొండ: చెరువు కట్టపై ఓ కారు అతివేగంగా ప్రయాణించి అదుపు తప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన ఘటన మణికొండ మున్సిపాలిటీ నెక్నాంపూర్‌లో గురువారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. గురువారం ఉదయం 11 గంటల సమయంలో నెక్నాంపూర్ చిన్నచెరువు కట్ట మీదుగా ఓ కారు అతివేగంగా వచ్చి అదుపు తప్పింది. పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి దూసుకుని వెళ్లి నిలిచిపోయింది. మరింత ముందుకు వెళ్తే కారు చెరువులో పడిపోయేది. అందులో ఉన్న నలుగురు యువకులు దిగి పారిపోయారని స్థానికులు పేర్కొన్నారు. చెరువు వద్ద అభివృద్ధి పనులను చేస్తున్న ధృవాన్ష్ సంస్థ ప్రతినిధి మధుళిక చౌదరి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 18 మందికి జైలు

రాజేంద్రనగర్: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 18 మంది మందుబాబులకు రాజేంద్రనగర్ స్పెషల్ కోర్టు 2–15 రోజుల పాటు జైలు శిక్ష విధించింది. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 6, శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 12 మందికి శిక్ష పడ్డ వారిలో ఉన్నారు. రాజేంద్రనగర్, శంషాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడ్డ వారిని గురువారం రాజేంద్రనగర్ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి నజీరుద్దీన్ ముందు హాజరుపరిచారు. అత్యధికంగా రీడింగ్ వచ్చిన 18 మందికి 2–15 రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. దీంతో పోలీసులు వారిని జైలుకు తరలించారు.

'భారత్ స్వేచ్ఛపై ప్రశంస'

రాయదుర్గం: విశ్వాసం, కుటుంబం, స్వేచ్ఛ అంశాలు సమాజ ప్రాథమిక నిర్మాణ వస్తువులని నార్వేజియన్ పాస్టర్ జాన్ ఆగే టోర్ప్ అన్నారు. భారత్ పర్యటనలో ఉన్న ఆయన గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని యూజీసీ మానవ వనరుల అభివృద్ధి కేంద్రం(యూజీసీ–హెచ్‌ఆర్‌డీసీ)ఆధ్వర్యంలో 'భారతదేశంలో సంస్కృతి, శాంతి' అంశంపై నిర్వహించిన ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతీయుల స్వేచ్ఛను ప్రశంసించాడు. తాను నార్వేలో పూర్తిగా అహింసాత్మకమైన అబార్షన్ వ్యతిరేక ప్రచారాలలో పాల్గొన్నానని గుర్తు చేశారు. గాంధీతత్వం ఎప్పటికీ బయటకు పోదు అని వ్యాఖ్యానించారు. అంతకుముందు జాన్ ఆగే టోర్ప్ ఉర్దూ విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్‌తో ప్రత్యేకంగా సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

ఈపీటీఆర్‌ఐ, సీఎంఈటీ ఎంఓయూ

గచ్చిబౌలి: ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్, నైపుణ్య శిక్షణ కోసం ఈపీటీఆర్‌ఐ (ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ రిజెర్చ్ ఇనిస్టిట్యూట్), సీఎంఈటీ (సెంటర్ ఫర్ మెటీరియల్స్ ఫర్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ)లు ఎంఓయూ కుదుర్చుకున్నాయి. గచ్చిబౌలిలోని ఈటీపీఆర్‌ఐలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీపీటీఆర్‌ఐ డైరెక్టర్ జనరల్ వాణి ప్రసాద్, సీఎంఈటీ డైరెక్టర్ రతీష్ ఒప్పంద సంతకాలు చేశారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల కలిగే నష్టాలు, ఈ వేస్ట్ రీసైక్లింగ్, లిథియం అయాన్ రీసైక్లింగ్, మొబైల్ డిస్‌ప్లే యూనిట్లు, రేర్‌ఎర్త్ మెటల్స్, సీఎఫ్ఎల్ బల్బుల నుంచి లోహాల రికవరీ తదితర అంశాలను చర్చించారు. ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్, టెస్టింగ్‌లపై శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో చీఫ్ సైంటిస్టు ఎస్.రవీందర్, డాక్టర్ జె.స్వరాజ్, డాక్టర్ జెఎస్ శ్రీనివాస్, డాక్టర్ సునీల తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి


స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్


మణికొండ చిత్రపురి కాలనీలో..


నార్సింగిలో.. మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖయాదగిరి


కోకాపేటలో..

శంషాబాద్: అంధత్వ నివారణకు ప్రభుత్వం ముందు 'చూపు'తో తీసుకున్న అద్భుత పథకం కంటి వెలుగు కార్యక్రమమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. శంషాబాద్ పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్‌హాల్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య తెలంగాణలో భాగంగా ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నార్సింగి ఏఎంసీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, కౌన్సిలర్లు, మస్రత్‌జాన్, జహంగీర్‌ఖాన్, అజయ్ పాల్గొన్నారు.


కంటి వెలుగును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

◆ **కంటి వెలుగుతో అంధత్వాన్ని నివారిద్దాం..**

రాజేంద్రనగర్: కంటి వెలుగుతో అంధత్వం నివారిద్దామని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్‌లోని మహిళా భవన్‌లో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆర్డీఓ చంద్రకళ, డీసీ జగన్‌తో కలిసి ప్రారంభించారు. రాజేంద్రనగర్ కార్పొరేటర్ అర్చన, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ధర్మారెడ్డి, మహేష్, ప్రజాప్రతినిధులు, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

◆ **అంధత్వ రహితమే లక్ష్యంగా కంటి వెలుగు..**

బండ్లగూడ: అంధత్వ రహితమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి అభ్యుదయనగర్, బైరాగిగూడలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆర్డీఓ చంద్రకళ, మేయర్ మహేందర్‌గౌడ్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్, బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు సురేష్‌గౌడ్ కార్పొరేటర్లు స్రవంతి, చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

◆ **కంటి వెలుగుతో ప్రజలకు మేలు..**

మణికొండ: కంటి వెలుగు కార్యక్రమం ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖయాదగిరి అన్నారు. చిత్రపురి కాలనీ ఎల్‌ఐజీలో, నార్సింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కోకాపేట కమ్యూనిటీహాల్, వట్టినాగులపల్లి వార్డు కార్యాలయాల్లో ఆయా మున్సిపల్ చైర్మన్లు వాటిని గురువారం ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్లు ఫల్గుణ్‌కుమార్, సత్యబాబు, వైస్ చైర్మన్లు నరేందర్ రెడ్డి, వెంకటేశ్‌యాదవ్, మండల వైద్యాధికారి డాక్టర్ పద్మ, మండల వైద్య విస్తరణాధికారి శ్రీనివాస్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

◆ **రషీద్‌గూడ, చౌదరిగూడలో..**

శంషాబాద్ రూరల్: కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్వీరాజు సూచించారు. మండలంలోని రషీద్‌గూడ, చౌదరిగూడలో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్ రాణిరవి, రాజ్‌కుమార్, వైఎస్ ఎంపీపీ నీలానాయక్, సొసైటీ చైర్మన్ దొనాకర్‌గౌడ్, ఉపసర్పంచ్ జగన్‌మోహన్‌రెడ్డి, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ దివ్యశ్రీ పాల్గొన్నారు.

◆ **అత్తాపూర్ డివిజన్‌లో..**

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్‌లోని చిన్న అనంతగిరి శివాలయం పాండురంగానగర్ కమ్యూనిటీహాల్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని కార్పొరేటర్ సంగీత, రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ జగన్ కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ నాయకులు కాడెం సుధాకర్, రాచూరి రాజశేఖర్, బీజేపీ అత్తాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి రావుల జగన్, స్టార్ చిన్న, ముఖేష్, లకన్, విజయ్, సతీష్, సరిత, కాంచన, జోషి, ఉమాబాయి, రమేష్, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్లు రాజు, వీరారెడ్డి, ఎస్ఎఫ్ఏలు రాజు, రవీందర్, డాక్టర్లు, నర్సులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

◆ **మైలార్‌దేవ్‌పల్లిలో..**

మైలార్‌దేవ్‌పల్లి: కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహిళా భవన్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు.


రషీద్‌గూడలో కళ్లజోడు అందజేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ


చౌదరిగూడలో.. సర్పంచ్ రాజ్‌కుమార్


పాండురంగానగర్‌లో.. కార్పొరేటర్ సంగీత


మైలార్‌దేవ్‌పల్లిలో.. కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


హౌసింగ్ బోర్డు కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలో అభివృద్ధి పనుల్లో భాగంగా నూతన తాగునీటి పైప్‌లైన్ పనుల కోసం, కాలనీలోని తదితర సమస్యలపై అధికారులు కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోని వాటికి శాశ్వత పరిష్కారాలు చూపిస్తున్నామన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడడమే తమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చిన్న, బబ్లూ, ఎల్.వి.రెడ్డి, నర్సింహారెడ్డి, శివ, పాండురంగారెడ్డి, బక్కన్న, హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ మేనేజర్ వినాయక్ తదితరులున్నారు.

సంతాప సభ


సంతాప సభలో పాల్గొన్న వర్సిటీ ఉపకులపతి డాక్టర్ నీరజప్రభాకర్ తదితరులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో సీనియర్ శాస్త్రవేత్త, టీచర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ హనుమాన్‌నాయక్ సంతాప సభను నిర్వహించారు. టీచింగ్, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యాన కళాశాలలో ఈ సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వర్సిటీ ఉపకులపతి డాక్టర్ నీరజప్రభాకర్ మాట్లాడుతూ.. ఉద్యాన విశ్వవిద్యాలయంలో సీనియర్ శాస్త్రవేత్తగా, వివిధ పరిశోధనా స్థానాలలో అధిపతిగా, టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ చైర్మన్‌గా పని చేసిన డాక్టర్ హనుమాన్‌నాయక్ మృతి బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ భగవాన్, డీన్ కిరణ్‌కుమార్, టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ జె.బీనానాయక్, ప్రధాన కార్యదర్శి టి.సురేష్‌రెడ్డి, డాక్టర్ ప్రశాంత్, నాన్‌టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతురాజు యాదయ్య, కుమార్, చెంచురామ్య, రజనీకాంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి


స్మార్ట్ క్లాస్ రూం ప్రారంభంలో పాల్గొన్న జీవన్ సింగ్

గోల్కొండ: ప్రైవేటు కంపెనీల వారు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడానికి ముందుకు రావడం హర్షనీయమని బీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి టి. జీవన్‌సింగ్ అన్నారు. గురువారం ఆయన కార్వాన్ జాఫర్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో పెగా సిస్టమ్స్ ఇండియా అండ్ ఇంటర్నేషనల్ కార్పొరేట్‌ల లీడ్ కౌన్సిల్ ధరణికోట సుయోధ్‌తో కలిసి స్మార్ట్ క్లాసరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ధరణికోట సుదర్శన్ మాట్లాడుతూ.. విద్యార్థులకు అత్యాధునిక సాంకేతికతను అందించడమే పెగా టీచ్ ఫర్ చేంజ్ స్మార్ట్ క్లాసరూం ధ్యేయమన్నారు. దీనివల్ల ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు భాషానైపుణ్యాలు అబ్బుతాయన్నారు. ఇందులో భాగంగా స్మార్ట్ క్లాసరూంలో ఎల్ఈడీ టీవి, లోలయింగ్ టేబుల్స్, కార్పెట్లు ఏర్పాటు చేస్తామన్నారు. పెగా సిస్టమ్స్ ధరణికోట సుయోధ్ మాట్లాడుతూ.. అండర్ ప్రివిలేజ్ పిల్లలకు ద పెగా టీచ్ ఫర్ చేంజ్ స్మార్ట్ క్లాస్ రూం ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో టీచ్ ఫర్ చేంజ్ సంస్థ ప్రతిధిని చైతన్య తదితరులున్నారు.

గంజాయి సరఫరా చేస్తున్న ఐదుగురి అరెస్టు

రాజేంద్రనగర్: ఎండు గంజాయిని స్మగ్లర్లు కొత్త పద్ధతుల్లో తరలిస్తూ పోలీసులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. కొత్తగా నడుముకు గంజాయిని కట్టుకోని ఒరిస్సా నుంచి ప్రైవేటు బస్సులో వచ్చిన ఐదుగురు యువకులను శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి పది కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. ఒరిస్సా నుంచి ఐదు మంది యువకులు ప్రైవేటు ట్రావెల్స్‌లో నగరానికి వచ్చారు. ఎండు గంజాయిని ప్లాస్టిక్ పాల్తీన్ కవర్లలో ప్రత్యేకంగా ప్యాక్ చేసి నడుముకు కట్టుకున్నారు. ఒక్కొక్కరు రెండేసి కిలోల చొప్పున ఈ గంజాయిని తమ నడుములకు కట్టుకోని నగరానికి చేరుకున్నారు. ఆరాంఘర్ వద్ద వాహనం దిగి మామూలుగా తమ గమ్యస్థానాలకు వెళ్తుండగా అనుమానంతో ఎస్ఓటీ పోలీసులు వారి బ్యాగ్‌లలో తనిఖీ చేశారు. కానీ ఏమి లభించలేదు. అనుమానంతో నడుము వద్ద తనిఖీ చేయగా ఒకొక్కరి వద్ద రెండు కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. తదుపరి విచారణ నిమిత్తం రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. ఇందుకు సంబంధించిన వివరాలను రాజేంద్రనగర్ పోలీసులు శుక్రవారం విలేకర్ల సమావేశంలో వెల్లడించనున్నట్లు సమాచారం.

ఫిబ్రవరిలో మనూలో అంతర్జాతీయ సదస్సు

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 27, 28వ తేదీలలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్, సదస్సు చైర్మన్ ప్రొఫెసర్ సల్మాన్ ఏ ఖాన్ గురువారం తెలిపారు. ఈ సదస్సులో పత్ర సమర్పణ చేయడానికి ఫిబ్రవరి 15 ఆఖరు అని పేర్కొన్నారు. 'ఎస్‌టీఐ భవిష్యత్తు–విద్య, నైపుణ్యాలు, పనిపై ప్రభావాలు' అనే అంశంపై, 'మిల్లెట్స్–ఫ్యూచర్ ఫుడ్ ఆఫ్ ఇండియా' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.

జీఎంఆర్ ఎరీనాలో రేపటి నుంచి జ్యోమాలాండ్ కార్నివాల్

శంషాబాద్: దుబాయ్ టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఈనెల 21, 22 తేదీలో ఎయిర్‌పోర్టులోని జీఎంఆర్ ఎరీనా వేదికగా జ్యోమాలాండ్ కార్నివాల్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ రకాల ఆహార ప్రదర్శనలతో పాటు గేమ్స్‌తో పాటు ఇతర వినోద కార్యక్రమాలు ఇందులో ఉంటాయన్నారు. హైదరాబాద్‌లో ఆతిథ్య రంగంలో ఉన్న పలు హోటళ్లు కూడా ఇందులో పాల్గొననున్నట్లు చెప్పారు.

కంటి వెలుగు ప్రభుత్వ పథకమా..?

బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారమా..?


ప్రభుత్వ పథకంపై బీఆర్ఎస్ పార్టీ ప్రచారాన్ని చూపిస్తున్న రాచూరి రాజశేఖర్

రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పథకాన్ని బీఆర్ఎస్ తమ ఎన్నికల ప్రచారంగా మార్చుకుందని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి రాచూరి రాజశేఖర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా అత్తాపూర్ డివిజన్‌లోని బస్తీ దవాఖానాలో నిర్వహించారు. అది ప్రజా సంక్షేమ పథకంలా లేదని, బీఆర్ఎస్ పార్టీ సొంత ఖర్చులతో దాన ధర్మం పథకంలా ఉందన్నారు. గులాబీ రంగుతో నిండిన బ్యానర్‌పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పథకం అని రాసుందన్నారు. ముఖ్యమంత్రి బొమ్మ ఉంటే అభ్యంత్రం లేదని, కానీ కళ్లజోడు డబ్బా కూడా గులాబీ రంగుతో ఉందన్నారు. అక్కడే ఉన్న సర్కిల్ ఉప కమిషనర్‌ను ఇది ప్రభుత్వ పథకమా..? లేక బీఆర్ఎస్ పథకమా అని ప్రశ్నించగా ఈ విషయం నాతో చర్చిచేది కాదని సమాధానం ఇచ్చారన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

శంషాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట్ మండలం అజిలాపూర్‌తండాకు చెందిన కెతావత్ ఆకాష్(25), వర్త్యా శివ(23) బుధవారం సాయంత్రం బైక్‌పై షాద్‌నగర్ వైపు శంషాబాద్ వస్తున్నారు. పెద్దషాపూర్ శివారులోని గొల్లూర్ చౌరస్తా వద్దకు రాగానే ముందు వెళ్తున్న పోలీసు వాహనం కుడి వైపు తిరుగుతుండగా వీరి బైక్ ఢీకొంది. గాయాలైన వీరిని ఆస్పత్రికి తరలిస్తుండగా ఆకాష్ మార్గమధ్యలో మృతి చెందాడు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు నార్సింగిలో పశుసంక్రాంతి

- నిజాం కాలంలో మొదలైన పశువుల సంత
- నిర్విరామంగా కొనసాగింపు
- ఏర్పాట్లు పూర్తి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్‌లు

మణికొండ: నిజాం కాలంలో మొదలైన పశుసంక్రాంతి ఒరవడి నార్సింగిలో నేటికీ నిరాటంకంగా కొనసాగుతుంది. పంటలన్నీ ఇంటికి చేరి అవి అమ్మగా వచ్చిన డబ్బులతో రైతులు సంక్రాంతి పండగను ఘనంగా జరుపుకుంటారని అందరికీ తెలుసు. మిగిలిన డబ్బుతో తమ పంటలకు తోడుగా పాడిని(పశువులు) కొనుగోలు చేసే సంస్కృతికి చిహ్నంగా నిలిచేదే ఈ పశుసంక్రాంతి. ఒకప్పుడు నార్సింగి కుగ్రామంగా ఉన్న సమయంలో ప్రారంభమైన ఈ సంస్కృతి నేడు మున్సిపాలిటీగా అవతరించినా కొనసాగుతుండటం అందరినీ అబ్బురపరుస్తుంది. ప్రతి సంవత్సరం సంక్రాంతి తరువాత వచ్చే శుక్రవారం పశుసంక్రాంతిగా నిర్వహిస్తారు. దీంతో గుజరాత్, హర్యానా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వేలాది గేదెలు, ఆవులను వ్యాపారులు ఇక్కడకు తెచ్చి అమ్ముకుంటారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న పశుసంక్రాంతిని ఈ సంవత్సరం నేడు నిర్వహించేందుకు నార్సింగి మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏర్పాట్లు పూర్తి చేసింది. నార్సింగి పశుసంక్రాంతికి దేశవ్యాప్త చరిత్ర ఉన్నా మార్కెట్ కమిటీని అనుకున్న స్థాయిలో అభివృద్ధి చేయటంలో ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం నార్సింగి పశుసంక్రాంతికి వచ్చే గేదెలు, ఆవులు రికార్డు ధరలు పలికి అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తాయి. గత రెండు సంవత్సరాలుగా దులియా జాతి గేదెలు ఏకంగా రూ.2.50లక్షలు పలికాయి. ఈసారి ఏ రకం గేదెలు, ఎంత ధరలు పలుకుతాయో ఈసారి జరిగే పశుసంక్రాంతిలో తేలనుంది.


నార్సింగి పశు సంక్రాంతికి అమ్మకానికి తరలివచ్చిన గేదెలు

తరలివస్తున్న గేదెలు...

- నార్సింగిలో సంక్రాంతి తరువాత శుక్రవారం నిర్వహించే పశుసంక్రాంతికి వివిధ రాష్ట్రాల నుంచి ఇప్పటికే వందలాది గేదెలు, ఆవులు తరలివచ్చాయి. మరిన్ని దారిలో ఉన్నాయని, శుక్రవారం ఉదయం వరకు అవి ఇక్కడకు చేరుకుంటాయని మార్కెట్ కమిటీ వర్గాలు పేర్కొన్నాయి.
- వాటిని అమ్ముకునేందుకు వీలుగా మార్కెట్ కమిటీ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దటంతో పాటు టెంట్‌లను ఏర్పాటు చేశారు.
- పనులను మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, వైస్ చైర్మన్ ప్రవీణ్‌యాదవ్ గురువారం పర్యవేక్షించారు.
- ఈసారి పంటలు బాగా పండటం, వరి పంటలు అధికంగా రావటంతో రైతుల వద్ద డబ్బు ఉందని, పంటలకు తోడుగా పశువులను పెంచుకోవాలనే దిశగా రైతులు ఆలోచన చేస్తున్నారని, దీంతో శుక్రవారం జరిగే సంతలో భారీగానే అమ్మకాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని వారు పేర్కొన్నారు.
- శుక్రవారం ఉదయం 10 గంటలకు పశుసంక్రాంతిని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రారంభిస్తారని వారు తెలిపారు.